రైతుకు యంత్రసదుపాయం..!

◆ యాంత్రీకరణకు మార్గదర్శకాలు

◆ ఈనెల 26లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వ్యవసాయ యంత్రీకరణ పరికరాల పంపిణీకి మార్గం సుగగమైంది. వెంటనే వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను సబ్సిడీతో రైతులకు అందివ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పంపిణీ ప్రక్రియ మొత్తాన్ని మార్చి 16వ తేదీలోపు పూర్తిచేయాలని సూచించింది. ఈ మేరకు అనంతపురం జిల్లాకు 1661 యూనిట్లు మంజూరు చేశారు. ఇందుకు రూ.2.86 కోట్ల నిధులు కేటాయించారు.

మార్గదర్శకాలు

గడిచిన ఐదు సంవత్సరాల్లో లబ్ధిపొందని రైతులై ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీ, మహిళా, చిన్నకారు రైతులకే 50 శాతం సబ్సిడీతో వీటిని అందివ్వనున్నారు. దీంతోపాటు విధిగా ఈ-పంటలో నమోదయి ఉండాలి. కుటుంబంలో ఒక్కరికే అర్హత ఉండనుంది. ట్రాక్టర్‌కు సంబంధించిన పనుముట్లు కావలంటే విధిగా రైతుకు ట్రాక్టర్ కలిగుండాలి.

దరఖాస్తు ఇలా..

ఈ పథకం కింద లబ్ధిపొందాలంటే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి. వ్యవసాయ సహాయ సంచాలకులు అప్రూవల్ ఇచ్చిన తరువాతనే లబ్ధిదారులు తమ వాట డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం పర్చేజ్ ఆర్డర్‌ను పొందిన తరువాత ఆగ్రోస్ సంస్థ తయారీ సంస్థలకు అప్పగించి వారి ద్వారా లబ్ధిదారులకు అందజేస్తారు. 5వ తేదీన గ్రామాల్లో వీటి వివరాలు తెలియజేయనున్నారు.

పంపిణీ చేయనున్న పరికాలు ఇలా...

వ్యవసాయ యంత్రీకరణ కింద పంపిణీ చేయాలని నిర్ణయించిన పరికరాలు ఈ విధంగానున్నాయి. క్నాప్‌సాప్ స్ప్రేయర్లు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్, రొటోవేటర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం కలిపి 1661 యూనిట్లు మంజూరు చేశారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

సబ్సిడీతో అందివ్వనున్న యంత్రీకరణ పరికరాలను పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేసి అందజేస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉమామహేశ్వరమ్మ జిల్లా సంయుక్త సంచాలకులు

నాడు జై.. నేడు నై..!

ఏజెన్సీలకు అప్పగించొద్దంటూ పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

◆ ఆప్కాస్ రద్దుతో ఉద్యోగ భద్రత కోల్పోతున్న కార్మికులు

◆ పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం

◆ ఆందోళనలకు సిద్ధమవుతున్న కార్మికులు

ప్రజాశక్తి హిందూపురం

సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లపై పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వైసిపి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి వారు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలిపారు. కార్మికుల ఆందోళనలో న్యాయం ఉందని, తాము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హిందూపురంలో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో సినీ నటుడు, స్థానిక ఎమ్మెల్యే, నందమూరి బాలకష్ణ పాల్గొని మద్దతు తెలిపారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు కార్మికులకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున గళం విప్పిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే నోరుమెదపడం లేదు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలతో పాటు వివిధ కార్యాలయాల్లో పొరుగు సేవలు అందిస్తున్న కార్మికులందరి పొట్ట కొట్టడానికి సిద్ధమయ్యే నిర్ణయాలు తీసుకునేలా అడుగులు వేస్తోంది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రోడ్డున పడేసేలా కార్పొరేషన్‌ను తొలగించి ఏజెన్సీల ద్వార వేతనాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శ్రీ సత్య సాయి జిల్లాలో 1100, అనంతపురం జిల్లాలో 3000 మంది వరకు కార్మికులు ఆప్కాస్ కార్పొరేషన్ నుంచి జీతాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరంతా తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రవేటు ఏజెన్సీల ద్వారా నిర్వహించే వారు. జీతాలు వారికి ఇస్తే, వారు కార్మికులకు చెల్లించే పరిస్థితులుండేవి. ఇందుకోసం జీతంలో ఒక్క శాతం ఏజెన్సీ తీసుకుటుంది. కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, జీఎస్టీలను ఏజెన్సీలు చెల్లించాలి. గతంలో ఏజెన్సీల చెల్లించకుండా దోపిడీ చేశాయి. వైసిపి ప్రభుత్వ సమయంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, అప్కాస్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఏజెన్సీలను తొలగించి అందరినీ దీని కింద చేర్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు సుమారు 5000 మందిని ఆప్కాస్ కింద చేర్చారు. నాలుగు శ్లాబ్ల కింద జీతాలు చెల్లిస్తున్నారు. రూ.12 వేలు, రూ.15వేలు, రూ.18,500, రూ.21,500 జీతాలు ఇస్తున్నారు. ప్రతి నెలా కాకుండా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన సమయంలో మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి చెప్పి పాత పద్ధతిలోనే ఏజెన్సీలకు వేతనాలు చెల్లింపు కాంట్రాక్ట్ బాధ్యతలను ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఈ విధానంలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ మరోసారి దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉంది.

కార్మికులకు మోసం

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిని పక్కన పెట్టి ఆసలకే మోసం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. కనీసం రూ.27 వేలు ఇవ్వాలని ప్రభుత్వ సిఫార్సు ఉంది. దీనిని అమలు చేయమని మాత్రమే కార్మికులు అడుగుతున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకు వీధులు చిమ్మడం, డ్రెయినేజీ పూడికలు తీయడం, ఇలా అన్ని పనులను చేస్తున్నారు. ఇంత శారీరక కష్టం పడుతోన్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదు. ఇదే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులున్నారు. వీరి పరిస్థితి అలానే ఉంది. అప్కాస్ కార్పొరేషన్ ద్వారానైనా పూర్తి జీతం చేతికొచ్చి, పిఎఫ్, ఇఎస్ఐ, జీఎస్టీ చెల్లిస్తోన్న సమయంలో ప్రభుత్వం ఏజెన్సీలకు లింకుపెట్టడాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాపితంగా కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమెండ్ చేస్తున్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు కార్మికులు సిద్ధం అవుతున్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చిన బాలయ్యకు వినతిని ఇస్తున్న కార్మికులు (ఫైల్ ఫోటో)

వైసిపి హయాంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫోటో)

చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

అధికారులను కోరిన సిపిఎం, సిఐటియు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తోపుడుబండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

నగరంలోని తోపుడు బండ్ల ద్వారా చిరు వ్యాపారాలు చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టేలా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజ తెలిపారు. అనంతపురం ప్రభుత్వ సరోజనాసుపత్రి ఎదుట ఉన్న తోపుడుబండ్ల వ్యాపారులను తొలగించాలని మున్సిపల్ అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేస్తారు. దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం నగరంలో 20 సంవత్సరాలకు పైగా తోపుడు బండ్ల పైన వ్యాపారం చేసుకుంటున్న వారిని తీసివేయాలని మున్సిపల్ అధికారులు చెప్పడం అన్యాయంగా ఉందన్నారు. అంబులెన్స్ వాహనాలు, ఆటోలు తీసేయాలి అనడం రోగులకు అసౌకర్యం కలిగించే అంశం అన్నారు. ఆసుపత్రికి వచ్చే పేదవారికి తక్కువ ధరలకే తినుబండారాలను 20 సంవత్సరాల పైగా వారు అందిస్తున్నారని తెలిపారు. అధికారులు మారినప్పుడల్లా ఈ విధంగా వ్యాపారులు, కార్మికుల మీద అధికారులు జులుం చేయడం పరిపాటిగా మారిందన్నారు. అధికారులు చిరు వ్యాపారుల మీద జులుం చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తోపుడు బండ్ల వ్యాపారుల మీద ఎవరు పెత్తనం చేసిన సిపిఎం ఎదురు నిలుస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివారెడ్డి, అంబులెన్స్ యూనియన్ నాయకులు జిలాన్, జయ, గోపాల్, అనిల్, సలీం, తోపుడు బండ్ల యూనియన్ నాయకులు వెంకటరత్నం, రామాంజి, రవి, రత్నమ్మ పాల్గొన్నారు.

'అనంతపూర్ హ్యాపీ స్ట్రీట్' పోస్టర్లు విడుదల

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే 'అనంతపూర్ హ్యాపీ స్ట్రీట్' పోస్టర్లను కలెక్టరే మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 9వ తేదీన ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో అనంతపూర్ హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలరాజు, నగరపాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికష్ణ, ఆర్డీటీ కోఆర్డినేటర్లు వంశీకృష్ణ, యుగంధర్, ఉమెన్ టీం అంజలి, దేవకి, రోస్లిమ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నవోదయం 2.0పై అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నవోదయం 2.0పై విస్తతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించిన కళాజాత ప్రచార వాహనాన్ని మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. నవోదయం 2.0పై నెల రోజులపాటు కళాజాత ద్వారా నాటుసారాపై అవగాహన కల్పించాలన్నారు. ఇందులో అధికారులు అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, సిఐలు జయనాథ్, సత్యనారాయణ, ఎస్ఐలు జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, కళాజాత బందం సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఇంటర్ పరీక్షకు 663 మంది గైర్హాజరు

అనంతపురం సిటీ : ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మంగళవారం 663 మంది గైర్హాజరైనట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణనాయక్ తెలిపారు. జనరల్ విద్యార్థులు 24,452 మందికి 23,789, ఒకేషనల్ విద్యార్థులు 2,475 మందికి 2,340 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు, కస్టోడియన్లు తనిఖీ చేశారన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

గుత్తి : ఈనెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి బి.శ్వేత తెలిపారు. మంగళవారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో మండల న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ లోక్ అదాలత్ లో రాజీమార్గంగా వీలైనంత కేసులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎపిపి సురేఖ, గుత్తి సిఐ బి.వెంకటేశ్వర్లు, పామిడి, పెద్దవడుగూరు సిఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు జెడ్.సతీష్, విసి.గంగాధర్‌కుమార్, కె.శ్రీనివాసులు,ఎ. సూర్యనారాయణ, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పరిశీలన

రాప్తాడు : మండలం కేంద్రం సమీపంలోని ప్రసనాయనపల్లిలో ఉన్న ఎరువుల రేక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రైలు మార్గంలో వచ్చిన ఎస్‌పిఐసి, కంపెనీ ఎరువులు యూరియా, డిఎపి కాంప్లెక్స్ ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయాలని సూచించారు. తర్వాత అయ్యవారిపల్లిలో ఉన్న ప్రయివేట్ అవేజ్ గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎం.రవి, అనంతపురం డిఎ ఎపి మార్క్‌ఫెడ్ పెన్నేశ్వరి, మార్కెట్ ఇన్‌ఛార్జి ఎఒ సోమశేఖర్, జెడిఎ ఎఒ బాలునాయక్, బికెఎస్ ఎఒ శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ కూడలిలో సిఐటియు అనుబంధ భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు ప్రజలను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంతోపాటు వేసవిలో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేస్తూ సేవ చేస్తున్నారన్నారు. కసాపురం అంజన్న రథోత్సవం సమయంలో భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. గత వైసిపి పాలనలో ఆటో, కార్ల డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద 10 వేలు ఇస్తుండగా ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తాము అధికారంలో రాగానే రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 9 నెలల్లో రెండు బడ్జెట్ సమావేశాలు జరిగినా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయింపు చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వాహనమిత్ర ఇవ్వడంతోపాటు ప్రభుత్వమే బీమా చెల్లించాలని, ప్రయివేటు ఫైనాన్సుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ అధ్యక్షులు జగదీష్, ఎస్‌కెఎం బాషా, ఆటో యూనియన్ నాయకులు హరి, వెంకటేష్, వెంకీ, రాజేష్, వేణు, గురుస్వామి, బండయ్య, అభి, మోహన్, సీనా, రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

38 చెరువులకు నీరు అందించండి

సిఎంకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రాప్తాడు నియోజకవర్గంలోని 38 చెరువులకు నీరందించడంతోపాటు లైనింగ్ వల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర రాజధానిలో సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులకు నీరందిస్తే రైతులు సంతోషపడతారన్నారు. అంతేగాకుండా లైనింగ్ వల్ల నియోజకవర్గానికి ఎలాంటి నష్టం రాకుండా చూడాలని కోరారు. ప్రాజెక్టు కోసం భూమిలిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని విన్నవించారు. ఇందుకు సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారన్నారు.



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పొలంబడిలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

భూమి ఉన్న ప్రతి రైతూ తప్పనిసరిగా యూనిక్ నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జూటూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఈనెల 7వతేదీలోపు పంట నమోదుతోపాటు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు మీ పరిధిలోని ఆర్ఎస్‌కె కేంద్రాలకు వెళ్లిఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం 50శాతంతో పనిముట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే కంది పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో కాయలకు కవర్లు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ చెంగల్‌రాయుడు, వ్యవసాయ అధికారి ఎం.ఆంజనేయులు, రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి

డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-రాయదుర్గం

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ఆర్ఎంపి వైద్యులు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఆర్ఎంపి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనవసర మందుల జోలికి వెళ్లకుండా ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. కట్లు కట్టడం, సలహా ఇవ్వడం, ఓఆర్ఎస్ ఇవ్వడం, సిపిఆర్ చేయడం మాత్రమే చేయాలన్నారు. హద్దు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి త్యాగరాజు, వైద్య విస్తరణ అధికారి గంగాధర్, స్థానిక వైద్యులు రమేష్ యశ్వంత్, జస్వంత్, అజర్, మాధవ, ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ, ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపి వైద్యుడికి నోటీసులు

ఆర్ఎంపి వైద్యం వికటించి విజయ్‌కుమార్ అనే వ్యక్తి మృతి చెందాడని మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో డిఎంహెచ్‌పి ఇబి.దేవి మంగళవారం స్థానిక ఆర్ఎంపి డాక్టర్ చన్నవీరకు నోటీసులు అందజేశారు. ముందుగా క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో అర్హతకు సంబంధించిన రికార్డులతో రెండు రోజుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు.

పలువురికి ఉద్యోగోన్నతులు

అనంతపురం రూరల్ : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు లభించాయి. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కె.నర్సింగరావు - ఎంపిపి సోమందపల్లి, జి.శ్రీనివాసరెడ్డి - ఎంపిపి నల్లమాడ, టి.ఫణి శేఖర్‌రెడ్డి - ఎంపిపి అగలికి నియమిస్తూ మంగళవారం జెడ్పీలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు సాధించిన ఉద్యోగులు జిల్లా ప్రజా పరిషత్‌కు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఉరవకొండ : రైతులు దళారీ వ్యవస్థను నమ్మి మోసపోవద్దని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని హావలిగి గ్రామంలో పశుగ్రాస విత్తన జొన్న పండించిన రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో సీడ్ ఇచ్చిన కంపెనీలు, ఆర్గనైజర్లుతోనే పంటలను కూడా కొనేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అంతేగాకుండా దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఆర్గనైజర్లకు అవగాహన కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సీడ్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని రైతుసంఘం నాయకులు కోరారు. ఇందుకు స్పందించిన ఎడిఎ మాట్లాడుతూ ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మండల వ్యవసాయ అధికారి శుభకర్, రైతుసంఘం నాయకులు నరసింహ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

'నారీరత్న' నిర్మలాకుమారికి అభినందనలు


నిర్మలాకుమారిని అభినందిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నారీరత్న' జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన నిర్మలాకుమారికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అభినందనలు తెలియజేశారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలకు 'ఆమెకు వందనం' పేరుతో పురస్కారాలు అందించనున్నారు. ఈ పురస్కారానికి అనంతపురానికి చెందిన ప్రిన్సిపాల్ నల్లి నిర్మలాకుమారి ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు-2025 (నారీ రత్న)కు ఎంపికయ్యారు. దీంతో నిర్మలాకుమారి తన కుమారుడితో కలిసి అనంత వెంకటరామిరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మెరుగైన సమాజం కోసం యువతను ఎప్పటికప్పుడు జాగృతం చేస్తూ వారిలో ప్రేరణ కల్పిస్తున్నందుకు నిర్మల కుమారిని అనంత వెంకటరామిరెడ్డి అభినందించారు.

అతిగా మద్యం తాగడం వల్లే వ్యక్తి మృతి

విజయ్ మృతిపై డిఎంహెచ్ఒ విచారణ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ అతిగా మద్యం తాగడం వల్లే మృతి చెందాడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇవి.దేవి తెలిపారు. స్థానిక ఆర్ఎంపి నిర్లక్ష్యం వల్లే విజయ్ మృతి చెందాడని మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన ఇబి.దేవి రాజీవ్‌గాంధీ కాలనీ సచివాలయంలో విజయ్ భార్య శిరీషా, తల్లి లక్ష్మీదేవిని మంగళవారం విచారించారు. అనంతరం మీడియాతో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ రాయదుర్గంలో విజయ్ మృతి ఘటనపై వచ్చిన కథనాలకు స్పందించి నేడు విచారణకు వచ్చినట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితమే విజయ్ తండ్రి మరణించడంతో ఆ దు:ఖంలో విజయ్ అతిగా మద్యం తాగడం వల్లే మృతిచెందినట్లు మృతుడి తల్లి, భార్య విచారణలో చెప్పారన్నారు. చికిత్స కోసం వైద్యుడు చెన్నవీర వద్దకు వెళ్లినప్పటికీ అతిగా మద్యం తాగినందు వల్ల వైద్యసేవలు అందించేందుకు నిరాకరించినట్లు తెలిపారన్నారు. దీంతో విజయ్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు.

అనంత వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

పోస్టు గ్రాడ్యుయేట్ ఫలితాల్లో 8 యూనివర్సిటీ ర్యాంకులు కైవశం

ప్రతిభ కనబరిచిన మెడికల్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రిలో విద్యనభ్యసిస్తున్న పిజి వైద్య విద్యార్థులు యూనివర్సిటీ వెలువడించిన ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. గైనకాలజీ విభాగం నుంచి మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. డాక్టర్ సుషోబితా 78శాతం మార్కులతో మొదటి ర్యాంకు, డాక్టర్ అమృత 77శాతం మార్కులతో 3వ ర్యాంకు, డెర్మటాలజీ విభాగం నుంచి డాక్టర్ శివానీ 78శాతం మార్కులతో మొదటి ర్యాంకు, డాక్టర్ నిహారిక 77.7శాతం మార్కులతో రెండవ ర్యాంకు, రమ్య 76శాతం మార్కులతో 4వ ర్యాంకు సాధించారన్నారు. ఫార్మకాలజీ విభాగం నుంచి సాగరిక 76శాతంతో 2వ ర్యాంకు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ హర్షిత 76శాతంతో 2వ ర్యాంకు, మైక్రోబైలజీ విభాగం నుంచి యల్లం నాయుడు 71శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించారన్నారు.

జింకా హోమ్ థియేటర్స్ బ్రోచర్ ఆవిష్కరణ

అనంతపురం : ధర్మవరంలో నూతనంగా ప్రారంభించిన జింక హోం థియేటర్స్ బ్రౌచర్ ను టిడిపి యువ నాయకుడు, పారిశ్రామికవేత్త సంధా రాఘవ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అతి తక్కువ ధరల్లో మీరు మీ ఇంట్లో హోం థియేటర్లు పెట్టుకోవచ్చని నవీన్ కె జింకా తెలిపారు. ఈ కార్యక్రమంలో సందా రవి, ఇటికింటి మహేష్, జిలకర శ్రీనివాసులు, చింతా శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుత్తి : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య శాఖ అనంతపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఆదినారాయణ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియాతో కలిసి పర్యటించారు. తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ హేమచంద్ర, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వేములపాడులో 'పొలంబడి'

యాడికి : మండల పరిధిలోని వేములపాడు రైతు సేవాకేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులందరూ తప్పకుండా ఎపిఎఫ్ఆర్ ప్రత్యేక గుర్తింపు కార్డులు పొందాలన్నారు. గుర్తింపు సంఖ్య లేకపోతే ప్రభుత్వ పథకాలు అనర్హులు అవుతారన్నారు. కాగా రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి జహిరూన్, గ్రామ వ్యవసాయ అధికారి సతీష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

పుట్లూరు : మండలంలోని జిసి.పల్లి, కోమటికుంట్ల, పుట్లూరు గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు, యల్లనూరు మండలా ఎంపిడిఒలు ఎంపిడిఒ అలివేలమ్మ, వాసుదేవరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజారెడ్డి, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు పిహెచ్‌సి తనిఖీ

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సికిల్ సెల్ మోడల్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులతోపాటు వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్‌సిడిసిడి, ఆర్‌సిహెచ్, లెప్రసి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు, జననీ శిశు సంక్షేమ కార్యక్రమాలు, గర్భిణులకు ప్రభుత్వ అందించే కిల్కారి సేవలు, సికిల్ సెల్ వ్యాధి వంటి వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లా కో ఆర్డినేటర్ ఫ్లోరిసిస్ ప్రివినేషన్ ఇన్‌ఛార్జి ఆంజనేయులు, సత్యనారాయణ, ఎంపిహెచ్ ఇఒ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నార్పల : మండల కేంద్రంలోని అలం కాంప్లెక్స్‌లో ఉన్న టిడిపి కార్యాలయ ఆవరణలో వెంకట్ వకుళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెంకట్ వకుళ ఫౌండేషన్ పిలుపుమేరకు దాదాపు 417 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు ఎన్టీఆర్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు, ప్రసంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష

అనంతపురం : అనంతపురంలోని పివికెకె ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఇంగ్లీష్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసా గ్లోబల్, అబ్రాడ్ ఫోకస్ సంస్థల డైరెక్టర్లు రాజ్‌కుమార్, అపర్ణ, కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్, ఫిలిప్స్ హాజరై కార్పొరేట్ రంగం, ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ వహీదా పర్వీన్, 730 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

నార్పల : మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సుంకల పార్వతిదేవి రథోత్సవం

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో మంగళవారం ఘనంగా సుంకల పార్వతిదేవి రథోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను తిలకించడానికి మండల పరిధిలోని కనకముక్కల, ఉండబండ, హావలిగి, విడపనకల్ గ్రామాలతోపాటు వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రైతు పాదయాత్రను విజయవంతం చేయండి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వతేదీ ఉరవకొండ నుంచి చేపట్టనున్న రైతు పాదయాత్రను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నాయకులు రాజారామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం స్థానిక రైతుసంఘం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పప్పుశనగ, కొర్ర పంటలకు క్వింటాకు రూ.5వేలతోపాటు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీలో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, క్రాప్‌లోన్లకు వడ్డీ రాయితీ ఇవ్వాలని, దళారుల మోసాన్ని అరికట్టాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వతేదీన ఉరవకొండ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. పాదయాత్ర 10వతేదీ కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్ర, ధర్నాలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల నాయకులు శిరీషా, జిల్లా కమిటీ సభ్యుడు రమేష్, నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వతేదీ ఉరవకొండ నుంచి చేపట్టనున్న రైతు పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్‌జొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న పాదయాత్రలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిసిపి మండల కార్యదర్శి శివశంకర్, రైతు సంఘం మండల కార్యదర్శి రాము, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఈనెల 7వతేదీ ఉరవకొండ నుంచి నిర్వహించనున్న రైతు పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం రైతుసంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కడవకల్లులోని వైఎస్ఆర్ సర్కిల్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల అధ్యక్షుడు బి.భాస్కర్, వ్యకాసం మండల కార్యదర్శి టి.పెద్దయ్య రైతు నాయకులు జె.పెద్దయ్య, టి.ఆదినారాయణ, వి.కుళ్లాయప్ప, కె.నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : పంటల గిట్టుబాటు ధర కోసం ఈనెల 7 నుండి ఉరవకొండ నుండి కలెక్టరేట్ వరకూ రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న రైతు పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

పండుగలా జనసేన ఆవిర్భావ సభ

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ పోస్టర్లు విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

పండుగ వాతావరణలో పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ తెలిపారు. మంగళవారం అనంతపురంలోని యాదవ కళ్యాణ మండపంలో ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు దశాబ్ధకాలంగా ఎన్నో కష్టాలు.. నష్టాలు.. అవమానాలను అధిగమించి కూటమి ప్రభుత్వంలో భాగస్వాములు అయ్యామన్నారు. పదేళ్ల కష్టానికి ఫలితం ప్రతిబింబించేలా ఆవిర్భావ సభ ఉంటుందన్నారు. కావున అనంత నుంచి జనసంద్రంగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబురావు, భవానీ రవికుమార్, సాకే మురళి, శ్రీకాంత్‌రెడ్డి, మణికంఠ, గౌతమ్, బాల్యం రాజేష్, లక్ష్మీపతి, మురళి, అంకే ఈశ్వరయ్య, నాగేంద్ర, సంజీవరాయుడు, రాపా ధనంజయ్, చొప్ప చంద్ర, జయమ్మ, అవుకు విజయ్ కుమార్, ముప్పూరి కృష్ణ, జక్కిరెడ్డి ఆదినారాయణ, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, కుమర మురళి, విశ్వనాథ్, లాల్ స్వామి, సంపత్, నెట్టికంటి హరీష్, ఆకుల అశోక్, వీరమహిళలు అనసూయ, శైలజ, దాసరి సరిత, శరణ్య, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆపార్టీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే మురళి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ మాట్లాడుతూ గత 11ఏళ్లుగా జనసేన పార్టీ వేదికగా ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఈనేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాకే మురళీకృష్ణ, చప్పా చంద్ర, పురుషోత్తంరెడ్డి, కృష్ణమూర్తి, దాడితోట శివయ్య, నాయకులు అశ్వత్‌రెడ్డి, వినోదం నారాయణస్వామి, సాకే రాజు, శ్రీధర్‌బాబు, కుళ్లాయప్ప, వినోదం లోకేష్, నాగరాజు, ఎం.కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

పామిడి : నాటుసారాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ ఉప కమిషనర్ నాగమద్దయ్య, సహాయ కమిషనర్ మునిస్వామి పిలుపునిచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాళ్యంతండాలో నాటుసారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నాటుసారా తాగితే అనారోగ్యానికి గురవుతారన్నారు. నాటుసారా తయారుచేసిన, విక్రయించిన కఠిన చర్యలు చేపడతామన్నారు. నాటుసారా లేని సమాజ నిర్మాణంకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఇ. మోహన్ రెడ్డి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, తహశీల్దార్, సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

బ్రహ్మసముద్రం : చౌకదాన్యం డిపో కేంద్రంలోని కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తహశీల్దార్ సుమతి సూచించారు. మంగళవారం బైరసముద్రంలో గ్రామంలోని చౌకధాన్యపు డిపోను తహశీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తూనికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి అన్సర్ బాషా, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల బోరంపల్లిలో ఎంప్లాయిమెంట్ ఎక్ఛైంజ్, డిఆర్‌డిఎ సంయుక్తంగా ఈనెల 7న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.వెంకట ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'భూమికి జీవం పోద్దాం'

యల్లనూరు : పంట వైవిద్యంతో భూమికి జీవం పోద్దామని అధికారులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన ఎరికల్‌రెడ్డి రెంకరాల పొలంలో పిఎండిఎస్ విధానంతో ఘన జీవామృతంతో విత్తనాలు విత్తన శుద్ధి చేసి విత్తనాలు వేశాడు. ఇందులో భాగంగా సజ్జ, ఆముదం, కంది, గోరుచిక్కుడు, అనుములు వంటి 20 రకాల జీవవైద్య పంటలు సాగు చేశారు. ఈమేరకు మంగళవారం ఆయా పంటల దిగుబడిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, విహెచ్ఎ విజయ్, డివిజన్ ఇన్‌ఛార్జి బాబయ్య, మెంటార్ దేవేంద్రనాయుడు, డిజిటల్ వెంకటేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి తిరుపాల్, ఐసిఆర్‌పిలు కళావతి, సాయి కుమారి రాణి రైతులు పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

కుంటలో నిర్మాణాల నిలిపివేతకు ఆదేశాలు

రాయదుర్గం : పట్టణంలోని కోటలో ఉన్న ఉపచర్తకుంటలో చేపట్టిన నిర్మాణాలను నిలిపివేయాలని తహశీల్దార్ నాగరాజు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కుంటలో నిర్మాణాల కోసం గుంతలు తవ్వినట్లు, నిర్మాణ సామగ్రి తరలించినట్లు ప్రజాశక్తిలో మంగళవారం వార్త ప్రచురితమైన విషయం విధితమే. స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుతోపాటు పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా తాను కుంట వద్దకు వెళ్లి స్థలాన్ని పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. కుంటలో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదన్నారు. తవ్విన గుంటలను వెంటనే పూడిచివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి చెంపపెట్టు

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష వైసిపికి చెంపపెట్టు అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కూటమి మద్దతిచ్చిన అభ్యర్థులు ఐదు చోట్ల గెలవడం ఇందుకు నిదర్శమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో దేశంలోనే రికార్డు స్థాయి మెజారిటీలతో ఘనవిజయం సాధించడాన్ని బట్టి చూస్తూ టిడిపి ప్రభుత్వంపై మేధావి వర్గం ఎంత సంతృప్తిగా ఉందనేది అర్థమవుతోందన్నారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన

శింగనమల : నియోజకవర్గ విద్యారంగ సమస్యలపై అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గళం విప్పడం హర్షణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగంలో అత్యంత వెనుకబడిన శింగనమల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో గళం విప్పాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గతనెల 19న ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రావణశ్రీకి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లడం సంతోషకరమన్నారు. ఇందుకు ఎస్ఎఫ్ఐ తరుపున ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ఆశా కార్యకర్తల సమావేశం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు పరమేష్, దేవరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంల సమావేశం ఏర్పాటు చేశారు. అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాపించే విష జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో దిబ్బలు, మురికికుంటలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జుబేదా పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, సరోజమ్మ పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో డాక్టర్ ఎం.శివకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం వడదెబ్బపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ శివప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, మలేరియా సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణమ్మ, ఎల్‌టి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు అవసరం

బుక్కరాయసముద్రం : క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని బెటాలియన్ కమాండెంట్ ప్రభూ కూమార్, అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి అన్నారు. పోలీస్ సిబ్బందికి జోనల్ క్రీడలు సాగుతున్న నేపథ్యంలో చియ్యేడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బండి గోపాల్ పోలీసు సిబ్బందికి క్రికెట్ కిట్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధుల్లో మానసిక వత్తిడికి గురవుతున్న నేపథ్యంలో మానసిక ఉల్లాసంగా ఉండటం కోసం ఆటలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు దివాకర్‌రావు, ట్రెజరర్ పునీత్‌బాబు, బెటాలియన్ పోలీసు ఆఫీసర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు పెద్దయ్య, వైఎస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'కు సహకరించాలని వినతి

బొమ్మనహాల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ త్వరలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లేందుకు తమకు సహకరించాలని ఆశావర్కర్లు కోరారు. ఈమేరకు మంగళవారం మండలంలోని శ్రీధర్‌ఘట్ట, దర్గాహొన్నూరు గ్రామాల్లో ఉన్న పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్లకు ఇందుకు సంబంధించిన కరపత్రాలను అందజేసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఓబులేసు, వన్నూరుస్వామి, లింగదహాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆర్థికసాయం

అనంతపురం : సరస్వతి విద్యా మందిరంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సాయి ట్రస్టు అధ్యక్షులు, సరస్వతి విద్యా మందిరం డైరెక్టర్ విజయసాయి కుమార్ మాతృమూర్తి వై.రుక్మిణి రూ.10,116 ఆర్థికసాయం అందించారు. సరస్వతి విద్యా మందిరంలో ప్రస్తుతం 7వ తరగతి వరకూ విద్యాబోధన సాగుతోంది. వచ్చే ఏడాది నుంచి 8 నుంచి 10వ తరగతి వరకూ విద్యా భోదన చేయాలని తలంచి అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టారు. ఈమేరకు ప్రిన్సిపాల్ వసుందరమ్మ, అకౌంటెంట్ వెంకటేస్వరమ్మకు సంబంధిత మొత్తాన్ని రుక్మిణి అందించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

అనంతపురం రూరల్ : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు ఎక్కువగా నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ చేనేత కార్మికులు మంగళవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న లేపాక్షి ఎంపోరియం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, జిల్లా పద్మశాలి సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు

నార్పల : నాణ్యమైన మామిడి దిగుబడుల కోసం ప్రభుత్వ రాయితీతో అందిస్తున్న ఫ్రూట్ కవర్లను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన అధికారి శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాయల్లో మంగు, మచ్చలు, రంగు, టెంక పురుగు, పండుకు ఈగ, వివిధ పురుగులు, తెగుళ్ల నుంచి రక్షణ కల్పించుకునేందుకు కవర్లు వాడాలని కోరారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

రాయదుర్గం : గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామ శివారులోని ఓ ఆలయం వద్ద గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేసి విగ్రహాలను తొలగించారు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు ఘటనను గుర్తించారు.

ఢిల్లీ మహిళా సదస్సుకు నార్పల ఇఒఆర్‌డి

నార్పల : కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మార్చి 4, 5వ తేదీల్లో మహిళా సాధికారతపై ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో నార్పల ఇఒఆర్‌డి శైలజారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, సహ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

శింగనమల : ఆటో అదుపుతప్పి కింద పడడంతో ఒకరు మృతి చెంది, మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన మంగళవారం మండల పరిధిలోని కల్లుమడి-తరిమెల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఆనందరావుపేట గ్రామానికి చెందిన వీరాంజనేయులు రోజూ ఐస్‌క్రీమ్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇందులో భాగంగానే పామిడికి వెళ్లి తిరిగి ఆటోలో ఐస్‌క్రీమ్ బాక్స్‌తో పెట్టుకుని వస్తుండగా కల్లుమడి-తరిమెల గ్రామానికి మధ్యగా రాగానే ఆటో కంపమొద్దుకు ఢీకొని కింద పడింది. దీంతో వీరనారాయణ (48) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం పెద్దాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్ యార్డులో మంగళవారం యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పిఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు సురేష్ (25) కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు పట్టణంలో ఓ ఫార్మసీ కంపెనీలో పని చేస్తున్నాడు. అతడు రెండు రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. ఆర్థిక సమస్యలతో సతమవుతమవుతున్న సురేష్ విధులు నిమిత్తం రాయచూరుకు వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పి గుత్తి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైల్వేస్టేషన్‌లోని యార్డులో నార్త్ క్యాబిన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన స్థలానికి జిఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పరిశీలించారు. సురేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జిఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిరుత దాడి..ఆవుదూడ మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి తండలో కుసుమావతికి చెందిన ఆవుదూడ సోమవారం అర్ధరాత్రి చిరుత పులి దాడిలో మృతిచెందినట్లు బాధితురాలు తెలిపింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి రమేష్, అటవీశాఖ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పెద్దన్న ఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన ఆవుదూడకు శవ పరీక్ష చేశారు. దూడ విలువ రూ.20వేలు ఉంటుందని, నష్టపరిహారం కోసం అధికారులకు నివేదికలు పంపిస్తామని పశువైద్యాధికారి తెలిపారు.

కేబుల్ వైర్లు చోరీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం మధ్యానేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న పొలాల్లో సోమవారం అర్ధరాత్రి సమయంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ చోరీకి గురైనట్లు బాధిత రైతులు మంజు, వెంకటప్ప, వన్నూరు స్వామి, జలంధర్, రామ్మూర్తి, రాజు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏడు మోటార్లకు సంబంధించిన కేబుల్ వైరు సుమారుగా 300 మీటర్లపైగా దొంగలించారన్నారు. దీంతో రూ.50వేలదాకా నష్టపోయినట్లు రైతులు వాపోయారు. పోలీసులు స్పందించి కేబుల్ వైర్లను చోరీ చేస్తున్న దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

విషపు నీరు తాగి జీవాలు మృతి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామంలో మంగళవారం పంటకు పిచికారి చేసిన విష ద్రావణం తాగి ఎరుకల రామన్నకు చెందిన 22 జీవాలు మృతి చెందినట్లు తెలిపారు. జీవాలు మేపుకుంటూ జీవనం సాగించే రామన్నకు 130 జీవాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే రోజూ మాదిరి మంగళవారం మధ్యాహ్నం సమయంలో జీవాలు మేత మేసి నీటి కోసం ఓ రైతు వ్యవసాయ తోటలోనే వెళ్లాడు. అయితే తొట్టిలో పంట కోసం విషం కలిపిన నీరు తాగి 14 గొర్రెలు, 8 మేకలు మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారి నవీన్‌కుమార్ సిబ్బందితో విష ద్రావణం తాగిన జీవాలకు ప్రాథమిక చికిత్సను అందించారు. దీంతో దాదాపు రూ.2.50లక్షల నష్టం సంభవించినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

బాలుడి మృతదేహం వెలికితీత

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు హరిజన దుర్గేష్ కుమారుడు దర్శన్ మృతదేహాన్ని మంగళవారం వెలికితీశారు. గత ఆదివారం దర్శన్ తన స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి నీటిని మునిగిపోయిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గాలించగా మంగళవారం బాలుడి మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు దేవినేని ధర్మతేజ కాలువ వద్దకు వెళ్లి బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్గంకు తరలించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

రాప్తాడు : యువతిని ప్రేమిస్తున్నానంటూ..వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... కురబ బ్యాళ్ల విష్ణువర్ధన్ రెండేళ్ల నుంచి ఓ యువతిని ప్రేమించేవాడు. ఈనేపథ్యంలో సంబంధిత యువతి వేరే వ్యక్తితో చనువుగా ఉంటోందని అనుమానించి చంపే ప్రయత్నం చేయడంతోపాటు తనవద్ద ఉన్న వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. ఇందుకు స్పందించిన పోలీసులు మంగళవారం స్థానిక కురుబ తిమ్మప్పస్వామి ఆలయవ వద్ద అరెస్టు చేసి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంతోపాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.